# మా నాన్న అంట్లుతోముతున్నాడు!

సాయంత్రం ఏడుగంటలయింది. గడియారం కుహూకుహూమని కోయిల లా కూస్తుంటే, ఫోన్ గణగణామని గొణగటం మొదలు పెట్టింది.

కిచెన్‌లో బిజీగావున్న సుబ్బారావ్, "సునీతా స్వీటీ! కెన్ యు గెటిట్ ప్లీజ్" అని అరిచాడు. ఆరేళ్ళ సునీత ఫోన్ తీసుకుని "హలో" అంది.

"శ్యామల వుందా" అడిగింది, నాలుగిళ్ళ అవతలనించి తాయారమ్మగారు. ఆవిడ మొన్నీ మధ్యనే, కోడలు పురిటి కోసం ఇండియానించి వచ్చింది.

అమెరికన్ ఇంగ్లీష్‌లో అమెరికన్ తెలుగు కలుపుతూ అంది సునీత "అమ్మ వెంటు హర్ జాబ్. జాబ్‌కి పోయింది" అని.

"ఎప్పుడొస్తారు?" అడిగింది తాయారమ్మగారు.

"ఎయిటో క్లాక్కి వస్తుంది. డాడీ కావాలా? కిచెన్‌లో అన్నం గిన్నెలు వాష్ చేస్తున్నాడు" అంది.

ఆ మాటవిని షాక్ కొట్టినట్టుగా చటుక్కున ఫోన్ పెట్టేసింది ఆవిడ.

హలో హలో అని, ఆవిడ ఫోన్ పెట్టేసిందని తెలుసుకుని, "షి ఈజ్ రూడ్" అని తనుకూడా ఫోన్ పెట్టేసింది సునీత.

ఇది సుబ్బారావ్ ద్వారా విన్నాక చిన్నప్పుడు ఇండియాలో చెప్పుకున్న ఒక జోక్ గుర్తుకొచ్చింది. మీ అమ్మేం చేస్తుందిరా అంటే, ఆఫీసుకి వెళ్ళింది అంటా డో ఆకతాయి. మరి మీ నాన్న? అంటే, అంట్లు తోముతున్నాడు అంటాడు.

అది ఆరోజుల్లో వినటానికీ చెప్పుకోటానికీ సరదాగా వుండేది. కొంతమంది పెద్దవాళ్ళకు కొంచెం బాధగా కూడా వుండేది. "ఏమిటబ్బాయ్! ఆ పిచ్చిమాటలు. అలా పెద్దవాళ్ళ గురించి అపహేళనగా మాట్లాడకూడదు. తప్పు" అనే వాళ్ళు.

నేను ఆ రోజుల్లోనే గుంటూరులో కాఫీ తాగిన కప్పు పెసరట్టు తిన్నప్లేటు దొడ్లో పనమ్మాయి అంట్లు తోమే చోట పెడుతుంటే "నీకెందుకురా ఆ ఖర్మ. మేమె వరమయినా తీసుకెడతాం కదా" అనేది మా అమ్మ ప్రేమతో.

అలాటివాడిని ఈ అమెరికావచ్చి ఎలా అయిపోయాను? వంట చేయటం, అంట్లు తోమటం (డిష్ వాషింగ్), ఇల్లు ఊడవటం (వాక్యూమింగ్), ఇంట్లో బూజు దులపటం (ఇదీ ఇంకో ఎటాచ్‌మెంట్ తగిలించిన వాక్యూమింగే), బట్టలు ఉతికి ఆరే యటం (వాషింగ్+డ్రైయింగ్), ఇంటి ముందూ వెనకా కళాపి చల్లటం (లాన్‌కి నీళ్ళు పెట్టటమన్న మాట) గడ్డి కోయటం (లాన్ మోవింగ్), మొక్కలకి ఆవు పేడ (కౌ మె న్యూర్) చేత్తో... నా చేత్తో... వేయటం (ఇంకా నయం అలకటంలాటివేమీ తెలీదు ఈ అమెరికన్లకి) మొదలైనవన్నీనేనే చేయటం. నేనే అంటే, నేను మాత్రమే అని కాదు, చాలమంది మగమహారాజులు అని. ఇలాటి బ్లాంకెట్ స్టేట్‌మెంట్ ఇస్తే, ఆడ మహారా ణులకి "హన్నా" అని ఇటు కోపమూ, అటు మగవాళ్ళ మీద అనుమానమూ వచ్చే అవకాశాలున్నాయి. అందుకని ఇక్కడ ఇంకో విషయం చెప్పటం ఎంతో అవసరం. డిస్‌క్లైమర్ అన్నమాట. చాలమంది తెలుగు మగవాళ్ళు ఒక్కొక్కప్పుడు వీటిల్లో

కొన్ని, అప్పుడప్పుడూ వీటిల్లో అతి కొన్ని ఎప్పుడూ బహు కొన్ని, ఎప్పుడయినా అన్నీ చేస్తుంటారని చెప్పక తప్పదు.

మా వూళ్ళో పాపారాయుడుగారు భావిసం అనే ఒక సంఘం కూడా సరదాగా పెట్టారు. భార్యా విధేయుల సంఘం అని. వారాంతం డీపీల్లో హాస్యంగా మాట్లాడుకోవటానికి ఇదొక మంచి టాపిక్. అన్నట్టు డీపీ అంటే రెండర్థాలున్నాయి డిన్నర్ పార్టీ అనీ, ధర్మపిండం అనీ. ఇవన్నీ సరదాగా అనుకునే మాటలు. నిజానికి భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ అలిసిపోయి సాయంత్రం ఇంటికివచ్చినపుడు ఒకళ్ళకొకళ్ళు ఇంటిపనిలో సహాయం చేసుకోవటం సామాన్యమైన విషయం అమెరికాలో. మన భారతీయుల్లోకూడా తెలుగువాళ్ళతో సహా ఎప్పుడో ఎక్కడో తప్ప చాల వరకూభార్యాభర్తలిద్దరూ చకచకా ఇంటి పనులు చేసుకుపోవటం మామూలుగా జరిగేదే. పిల్లలు కూడా చిన్నప్పటినించీ, ఎవరి కంచం వాళ్ళే సింక్ దగ్గరకి తీసుకు వెళ్ళటం, కొంచెం పెద్దపిల్లలయితే అవి కడగటం ఎవరి గదులు వాళ్ళే వాక్యూమ్ చేసుకోవటం ఇంట్లో గార్బేజ్‌తో నింపిన సంచులు బయట గార్బేజ్ డబ్బాలో పడేయటంలాటివి చిన్నప్పటినించే అలవాటు చేసుకుంటారు. షాపింగ్‌కి వెళ్ళినప్పుడు ఏ మాల్‌లోనో ఎక్కడయినా ఏ కాగితం ముక్కో కనపడితే, చిన్నవాళ్ళ దగ్గరనించీ చితకవాళ్ళ దాకా, అది తీసి దగ్గరే వున్న ట్రాష్ డబ్బాలో పడేస్తుంటారు.

అమెరికన్ సంస్కృతిలో ఇది అన్నిప్రాంతాల్లోనూ చిరకాలంగా వున్న అలవాటు. మనవాళ్ళు అమెరికన్స్ దగ్గరనించి నేర్చుకున్న మంచి అలవాట్లల్లో ఇదొకటి. మన ఇంటికి ఎవరు వచ్చినా, వాళ్ళు కూడా వంటింట్లో శుభ్రం చేయటంలోనూ, లివింగ్‌రూమ్‌లో కుర్చీలు సర్దటంలాటి ఇతర పనులలోనూ సహాయం చేస్తుంటారు. ఆఫీసుల్లో బాసాసురుడు, బ్రేక్ రూమ్‌నించి తను తెచ్చుకునే కాఫీతో పాటు మనకి కూడా ముఖమాటం లేకుండా కాఫీ తెచ్చి పెడతాడు. కాకపోతే అతను తాగే పాలు లేని నల్ల కాఫీ తెస్తాడు.

మా టెక్సాస్‌లోనే రెండొందల మైళ్ళ దూరంలో వున్న ఇంకో వూళ్ళో వుంటాడు రామ్ బాణం. ఆయన అసలు పేరు బాణం రామనాథం. ఆయనకి అమెరికాలోనే పుట్టి అమెరికాలోనే పెరిగిన ఒక కూతురు. పేరు ప్రేమ బాణం కూతురికో సరికొత్త మొగుడు. ఈ కదలో మలుపు ఎక్కడ తిరిగిందంటే, ఆ అమ్మాయి అమెరికాలో పెరిగిన కుర్రాడినే పెళ్ళిచేసుకుంటానన్నా ఆ పిల్ల తల్లి పూల బాణం పట్టుబట్టి ఇండియా తీసుకువెళ్ళి అక్కడే పెళ్ళిచేసి తీసుకొచ్చింది. ఆ అల్లుడు పూల బాణంకి వేలు విడిచాడో, విరిచాడో, ఏం చేశాడో తెలియని దగ్గరయిన దూరపు చుట్టం.

ఆ అబ్బాయి అమెరికా వచ్చిన రెండో రోజునే మొదలయింది కథ. అచ్చం మిష్టర్ పెళ్ళాం సినిమాలో రాజేంద్రప్రసాద్ కథే. ఇంకా ఉద్యోగం రాలేదు కనుక, అసుంటా సోఫాలో అలవోకగా ఆనుకుని, ఠీవిగా టీవీలో అన్నిచెత్త ప్రోగ్రాములూ చూస్తూ ఫ్యాను కాఫీ టిఫినూ బ్రష్షూ పేస్టూ అంటాడు తప్పితే అక్కడినించీ లేవడు

ఆ అమ్మాయికేమో అటు ఆఫీసు, ఇటు మొగుడి దగ్గరనించీ అస్సలు అలవాటులేని ఈ అత్తరికపు పెత్తనం. ముందు మర్యాదగా చెప్పి చూసినా వాతావరణం

లో ఏమీ మార్పు కనపడలేదు అందుకని ప్రేమ బాణం ఆఫీసులోని ఫ్రెస్ ఇంట్లో మొగుడి మీద చూపించటం మొదలుపెట్టింది

పూల బాణం ఎంతో ఓర్పుగా కూతురికిఅల్లుడికీ సాధ్యమైనంతగా చెప్పి చూసింది, 'అమ్మా! బాబూ! సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారు కనుక సాధన చేయండి " అని

ఇద్దరూ "సరే! సరే! సాధన చేసి సాధిస్తాం" అని చెప్పి, అది సాధించ లేక ఒకళ్ళనొకళ్ళు సాధించుకోవటం మొదలుపెట్టారు ఆ సాధించుకోటాలు వాదించుకోటాలై, త్వరలో వేధించుకోటాలై, ఇద్దరూ కోటా సిస్టమ్‌లో ఒకళ్ళనొకళ్ళు బాధించుకోటాల దాకా వెళ్ళింది ఇంట్లో తోరణంలా కట్టిన మావిడాకులు ఎండిపోవటం, వీళ్ళేమో విడాకులు అందుకోవటం ఒకేసారి జరిగాయి అలా మిష్టర్ పెళ్ళాంగారి మార్చుకోలేని అలవాట్ల వల్ల, రాముడు విరిచిన శివధనుస్సులా, రామ్ బాణంగారి అమ్మాయి ప్రేమ బాణం వివాహం విడాకులతో విరిగిపోయింది

ఇది ఒక కథ అయితే మా స్నేహితుడు బాబ్ ఆర్ బొబ్బర్లంక ఇంతకన్నా గొప్ప కద చెప్పాడు (అతని పూర్తి పేరు బొబ్బర్లంక రాజబాబు) ఈమధ్య అతని అత్తయ్యా మామయ్యా ఇండియానించి వచ్చి వాళ్ళ దగ్గర ఆరునెలలు వున్నారుట

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని, కంచంలో కూర మారు వడ్డించుకోటానికి్కూడా మామయ్య చేయి ముందుకు వచ్చేది కాదుట టేబుల్ దగ్గర కూర్చున్న వాళ్ళల్లో ఎవరో ఒకళ్ళు వడ్డించకపోతే అలాగే కూర్చునే వాడుట వేళ్ళు చీకుతూ ఆయన వేళ్ళు చీకుతుంటే, ప్చ్ ప్చ్ అనే శబ్దంతో సరిగమలు పలికించేవాడని కూడా బాబ్ అన్నాడు ఆయనలా వేళ్ళు చీకటం భరించలేని ఎవరో ఒకళ్ళు ఆయన అడక్కపోయినా వడ్డించేవాళ్ళుట అలాటి శ్రీమగమహారాజు అమెరికా వచ్చిన ఆరునెలల్లో పూర్తిగా మారిపోయి డైనింగ్ టేబుల్ మీది గిన్నెలు తీసుకువెళ్ళి మళ్ళీ కిచెన్‌లో ఆయనంతట ఆయనే సర్దటం మధ్యమధ్యలో కించిత్తు అంట్లగిన్నెలు కడగటంలాటివి కూడా మొదలుపెట్టారుట ఆరునెలల్లో మామయ్య వారు వీరుగా మారిపోయిన పద్ధతి చూసి అందరూ ఎవరి ముక్కు మీద, వాళ్ళ వేళ్ళు వాళ్ళే వేసుకునే పరిస్థితికి వచ్చారుట ఈ కథకి బాబ్ బొబ్బర్లంక చెప్పిన ముగింపు కూడా రసవత్తరంగానే వుంది మామయ్య ఇండియా వెళ్ళిపోయాక, వాళ్ళింట్లో పనిమనిషిని మానిపించేసి, ఆ పనులుకూడా తనే చేస్తున్నారని తనకి అనుమానంగా వుందన్నాడు మీకు అనుమానంగా వుంటే బొబ్బర్లంక వెళ్ళి అక్కడి డేరా హాల్లో వెండితెర వుంటే దాని మీద చూడమన్నాడు ఏదయితేనేం, ఎక్కడో మొదలు పెట్టి ఎక్కడో తేలాం

భార్యాభర్తలిద్దరూ ఇంట్లో అన్ని పనుల్లోనూ ఒకళ్ళకొకళ్ళు సహాయం చేసుకోవటం నిజంగా మంచిదే దానివల్ల ఇంట్లో ఎంతో చక్కటి అనురాగ పూరిత వాతావరణం ఎర్పడే అవకాశం వుంది ఇద్దరూ ఉద్యోగాలు చేసే వాళ్ళయితే, మరీ మంచిది వారి సంసారం ఆర్థికంగా నిలబడటానికి, పేన్నీళ్ళకి చన్నీళ్ళలాగా ఒకళ్ళకొకళ్ళు కాకపోతే వాళ్ళిద్దరి వేన్నీళ్ళూ చన్నీళ్ళూ పిల్లలకి కన్నీళ్ళు కానంత కాలం ఫరవాలేదు